తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# భక్తిశ్రద్ధలతో మహాచండీయాగం

సూళ్లూరుపేట, మార్చి 7 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా మహాచండీయాగాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా దేవస్థానం ప్రాంగణంలోని యాగ మండపం వద్ద గోమాతకు పూజ చేసిన అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య చండీయాగాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో యాగం ముగిసింది. కార్య నిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో చెన్నైకి చెందిన పెళ్లూరు శ్రీనివాసులురెడ్డి, ప్రసన్నశ్రీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వృద్ధుడి ప్రాణాలు కాపాడిన రైల్వే లోకో పైలట్

కుప్పం, మార్చి 7 ప్రభాతవార్త


వృద్ధుడ్ని పట్టాలు దాటిస్తున్న దృశ్యం

రైలు పట్టాలు దాటుతున్న ఓ వృద్ధుడు వేగంగా వస్తున్న రైలును గుర్తించలేకపోయాడు. అయితే వృద్ధుడ్ని గుర్తించిన రైలు డ్రైవర్ (లోకో పైలట్) సమయస్ఫూర్తితో రైలును కొంత దూరంలోనే ఆపేయడంతో స్థానికులు అతన్ని పట్టాలు దాటించారు. దీంతో వృద్ధుడు క్షేమంగా బయటపడ్డాడు. మంగళవారం కుప్పం రైల్వే స్టేషన్‌లో ఈ సంఘటన జరిగింది. రైలు పట్టాలు దాటుతున్న వృద్ధుడ్ని గుర్తించి రైలును ఆపేసిన లోకో పైలట్‌ను స్థానికులు అభినందించారు.


పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీనివాసమంగాపురంలో మంగళవారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

## మహిళా సంఘాలు

# ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

- అన్ని రంగాల్లో మహిళలు రాణింపు
- విద్యతోనే ఆర్థికాభివృద్ధి, ఆడపిల్లలకు విద్య ఎంతో అవసరం
- మహిళా దినోత్సవంలో కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, మార్చి 7 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని మహిళా సంఘాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శకంగా నిలుస్తున్నాయని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో మంగళవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించి అగ్రగామిగా నిలుస్తున్నారన్నారు. మనిషికి జన్మను ఇచ్చే శక్తి ఒక్క మహిళకే వుందని, మహిళలను గౌరవించడం మన సంస్కృతి అన్నారు. దేశంలో వున్న కుటుంబ వ్యవస్థలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని, కుటుంబ అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను మహిళల పేర్లతోనే మంజూరు చేస్తోందన్నారు. పురుషులకు ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నారన్నారు. ఒకప్పుడు సైన్యంలో కొన్ని విభాగాలకు మాత్రమే పరిమితం అయిన మహిళలు ప్రస్తుతం సాయుధ దళాల్లో సైతం విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. సమాజంలో విద్యతోనే మార్పు తీసుకురావచ్చునని, ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమని, ఆడ, మగ అనే వ్యత్యాసం లేకుండా ఇద్దరిని సమానంగా చూడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక స్థానం వుందన్నారు. పురాతనకాలం నుండి మహిళలను గౌరవిస్తున్నామని, ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు మరింత అభివృద్ధి చెందాలని ఆయన పిలుపునిచ్చారు. డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతతో పాటు పిల్లల సంరక్షణ, ఇతర బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ప్రతి అంశంలో ప్రస్తుతం మహిళ కీలకంగా మారిందన్నారు. ప్రపంచం మొత్తం ప్రస్తుతం మహిళల అభివృద్ధి వైపు చూస్తోందన్నారు. ఐసిడిఎస్ పిడి నాగశైలజ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా వుండి వారి కుటుంబం మొత్తం ఆరోగ్యంగా చూసుకోవాలన్నారు. సమాజంలో బాల్యవివాహాల అడ్డుకట్టకు పక్కాగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, మండల సమాఖ్య, విఓలకు కలెక్టర్ మెమొంటోలు అందజేశారు. అలాగే జిల్లా అధికార యంత్రాంగం తరపున మహిళా అధికారులను జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఎల్డీఎం శేషగిరిరావులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం శేషగిరిరావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హిమబిందు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారిణి రాజ్యలక్ష్మి, జిల్లా ప్రణాళిక అధికారి ఉమాదేవి, డిఐపిఆర్‌ఓ పద్మజ, ఎపిడలామిస్ట్ శ్రీవాణి, సిడిపిఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళా ఉద్యోగులకు మెమొంటోలు అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్.

# టెన్త్ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

- జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్

చిత్తూరు, మార్చి 7 ప్రభాతవార్త:

జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుండి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. టెన్త్, ఇంటర్మీడియేట్, ఓపెన్ స్కూల్ పరీక్షల పక్కా నిర్వహణ కోసం డిఆర్‌ఓ ఛాంబర్‌లో మంగళవారం డిఆర్‌ఓ రాజశేఖర్ విద్యా, పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆర్టీసీ, విద్యుత్, తపాలా, రవాణా, ఖజానా, మున్సిపల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుండి 18వ తేదీ వరకు జిల్లాలో జరిగే టెన్త్ పరీక్షల నిర్వహణను ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకొని పక్కాగా నిర్వహించి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 115 పరీక్షా కేంద్రాల్లో 21,996 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఇందులో భాలురు 11,140, బాలికలు 10,556, ప్రైవేటు విద్యార్థులు 436 మంది వున్నారన్నారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9 గంటకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు విద్యాసంస్థలు సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిఇఓ విజయేంద్రరావును డిఆర్‌ఓ ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌళిక సౌకర్యాలను పక్కాగా కల్పించడానికి చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా ఆర్టీసీ బస్సులు నడుపాలన్నారు. అలాగే పరీక్షా సమయంలో విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా పక్కా చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జెరాక్స్ సెంటర్లు మూసి వేయాలన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేయాలన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షలను పకడ్బందీగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఇఓ విజయేంద్రరావు, నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి, ఓపెన్‌స్కూల్ కో-ఆర్డినేటర్ గురుస్వామిరెడ్డిలతో పాటు తపాలా, ట్రాన్స్‌కో, రెవెన్యూ, ఆర్టీసీ, మున్సిపల్ శాఖల అధికారులు హాజరయ్యారు.


టెన్త్ పరీక్షల పక్కా నిర్వహణపై అధికారులతో డిఆర్‌ఓ నిర్వహించిన సమన్వయ సమావేశం.

# ఎర్రచందనం దొంగలు అరెస్ట్

## 23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
## మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం, ఆరుగురు అరెస్ట్

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 7 ప్రభాతవార్త:



అన్నమయ్య, కడప జిల్లాల్లో సోమవారం రాత్రి 23 ఎర్రచందనం దుంగలు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని ఆరుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు డిఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు టీమ్‌లు సోమవారం కూంబింగ్ నిర్వహించాయి. ఆర్ఎస్ఐ ఆలీబాషా బృందం అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు, బాలపల్లి ఈస్ట్ ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా, కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. సిబ్బంది మెరుపు వేగంతో అక్కడికి చేరుకుని వారిని చుట్టుముట్టి ముగ్గురిని పట్టుకున్నారు. అయితే నవీన్ అనే వ్యక్తి పారిపోయాడు. వీరి నుండి ఒక మోటార్ సైకిల్, 11 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిలో రైల్వే కోడూరు మండలానికి చెందిన మణికంఠ(28), కోలం వెంకటశేషయ్య(32), కూని వెంకటేశ్వర(21)లుగా గుర్తించారు. అలాగే ఆర్ఎస్ఐ టి.రాఘవేంద్ర టీమ్ కడప జిల్లా ముత్తుకూరు ఫారెస్ట్ బీట్ పరిధిలో పాతూరుకుంట సమీపంలో కొందరు వ్యక్తులు మోటార్ సైకిళ్లు పెట్టుకుని అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని ప్రశ్నించేసరికి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని చుట్టుముట్టి పట్టుకోగా, వారి సమీపంలో దాచి ఉంచిన ఎర్రచందనం డంప్‌ను కనుగొన్నారు. అక్కడ 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. వీరు అట్లూరు మండలానికి చెందిన అన్నపు నరసింహులు(39), డబ్బుగోడ్డు లక్ష్మీనరసయ్య(47), గొర్ల రాము(45)లుగా గుర్తించారు. వీరి నుండి రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 23 ఎర్రచందనం దుంగలు 299 కిలోలు ఉండగా, వాటి ధర 30 లక్షలు ఉండవచ్చని అంచనా వేశారు. రెండు కేసులను సిఐలు చంద్రశేఖర్, బాలకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

# మోక్షం...మలయప్ప తెప్ప వీక్షణం!

## వైభవంగా ముగిసిన దేవదేవుని తెప్పోత్సవాలు



తిరుమల, మార్చి 7(ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగవైకుంతంలోని పవిత్రపుణ్యతీర్థాల సంగమమైన పుష్కరిణి తెప్పోత్సవాలతో పులకించింది. ఐదురోజులుపాటు వేడుకగా జరిగిన తెప్పోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. చివరిరోజు శ్రీదేవిభూదేవిసమేత మలయప్ప స్వామి అలంకారంలో తెప్పపై కొలువుదీరిన దేవదేవుడు పుష్కరిణిలో ఏడుచుట్లు ప్రదక్షణలు చేసి విహరించారు. ఈ కలియుగంలో భక్తులను కాపాడేందుకు తానున్నానంటూ స్వామివారు అభయమిచ్చారు. భక్తుల గొంతుకలు ఏకమవ్వడంతో గోవిందనామస్మరణలతో పుష్కరిణి పులకించింది.

# తొలిరోజు ఎస్వీయూ న్యాక్ పీర్ టీమ్ పర్యటన



తిరుపతి (క్రీడ), మార్చి 7, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం న్యాక్ పీర్ కమిటీకి ఘన స్వాగతం పలికింది. ఉదయం 9.30 నుండి షెడ్యుల్ ప్రకారం విసి చాంబర్‌లో ప్రిన్సిపాల్స్, డీన్ల సమక్షంలో న్యాక్ కమిటీ మెంబర్లకు పవర్ పాయింట్ ద్వారా విసి రాజా రెడ్డి విశ్వవిద్యాలయ ప్రగతిని వివరించారు. ఎస్వీయూ సెనేట్ హాల్‌లో శాఖాధిపతులు, పాఠ్యప్రణాళికా మండలి చైర్మన్లతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. న్యాక్ కమిటీ సభ్యులు మూడు టీమ్స్‌గా ఏర్పడి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, మేనేజ్మెంట్, ఇంజనీరింగ్ విభాగాలను సందర్శించారు. ప్రతి అంశంపైన శాఖలను ప్రశ్నించి వివరాలు తెలుసుకుంటున్నారు. విశ్వవిద్యాలయాన్ని విహంగ వీక్షణ ద్వారా వివిధ బిల్డింగ్స్‌ను చూశారు. శ్రీనివాస ఆడిటోరియంలో విద్యార్థులు ప్రదర్శన చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రేపు పరిశోధన కేంద్రాలను వివిధ సంస్థలను సందర్శించనున్నారు.

# పౌర్ణమి భక్తులతో కిట కిట

## రాహుకేతుదోష నివారణ పూజలకు తగ్గని రద్దీ



శ్రీకాళహస్తి, మార్చి 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం మంగళవారం పౌర్ణమి సందర్భంగా భక్తులు పొటెత్తారు. సాధారణంగానే శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం రాహుకాల సమయంలో రద్దీ అధికంగా ఉంటుంది. అయితే పౌర్ణమి కూడా రావటంతో ఇక చెప్పక్కర్లేదన్నట్లు మారింది. మూడు రోజుల నుంచి కదలి తరంగాల్లా జనం కదలి వచ్చారు. ఇక ముందుగానే అంచనా వేసిన ఇఓ వికె సాగర్‌బాబు వేకువ జామునుంచి ఆలయంలో తన సిబ్బంది ద్వారా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు. పలుమార్లు రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లు లైన్ల వద్ద అలాగే రాహుకేతు మండపాల్లో పరిశీలనలు జరిపారు.

### హర హర మహాదేవా శంభోశంకరా!!

శ్రీకాళహస్తీశ్వరాయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి పొరుగు రాష్ట్రాల భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. పౌర్ణమి కావటంతో సోమవారం రాత్రి నుంచి పొరుగు ంష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. చలి తగ్గుతుంది. వేడి పెరుగుతుంది. ఎండలు దడపుట్టిస్తున్నాయి. అయితే భక్తులు మాత్రం కదలి తరంగాల్లా కదలి వస్తున్నారు. అయితే దర్శనాలకు వచ్చిన సామాన్య జనం తిప్పలు వర్ణనాతీతంగా మారింది. పట్టణంలోని నాలుగుమాడావీధుల్లోని అతిధి గృహాలు నిండాయి. బస అవకాశం లేక ఇబ్బందులు పడ్డారు. ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకొని బాధల నుంచి విముక్తి పొందటానికి ప్రయత్నిస్తున్నారు. ఆదివారం ఈ పూజలు జరిపించుకున్న భక్తులు దర్శనాలకు తిప్పలు పడ్డారు.

### ఇఓ వచ్చినపుడు పారదర్శకత:

ఆలయంలో పని చేస్తున్న సిబ్బందికి లాడ్జిల్లో పని చేసే వారికి అవగాహన కుదుర్చుకొని ప్యాకేజిలు అమలు చేస్తున్నారు. లాడ్జి రేటుతో పాటు ఆలయంలో ప్రత్యేక, సత్వర దర్శనాలకు ప్యాకేజిలు ఖరారు చేసుకుంటారు. ఉదయం దళారి నుంచి ఫోన్ దర్శనాలకు రాచబాటగా మారింది. అయితే తమ ఒప్పందాలు బయట పడకుండా పరిశీలనకు అధికారులు వచ్చే సమయంలో మాత్రం ఎక్కడ లేని నిబంధనలంటూ అమలు చేస్తున్నారు. ఎంత కట్టుబాటు అంటే ఇఓ ఆలయంలో పర్యవేక్షించే సమయంలో మాత్రం తన సిబ్బంది ఇంత పారదర్శకతతో పని చేస్తున్నారా? అని ఆశ్చర్యపోయలా నటిస్తున్నారు. ప్రకటనల్లో మాత్రం సామాన్యభక్తుల దర్శనాలకు పెద్ద పీట. ఆచరణలో అంతా పలుకుబడి మయం చేస్తున్నారు. ఎన్ని క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా, విధుల నుంచి తొలగిస్తున్నా మళ్ళీ మళ్ళీ ఏదో ఒక నాయకుని సిఫార్సులతో ప్రవేశించటం తమ పాత పద్ధతులను మానటం లేదు. దాంతో వ్యవస్థ అభాసుపాలౌతుంది.

### 30వేల మంది దర్శనం

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి సుమారు 25వేల మందిభక్తులు దర్శించుకున్నట్లు సాయంత్రం విడుదల చేసిన సమాచారంలో ఆలయాధికారులు పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు 4491 మంది పూజలు జరిపించుకున్నట్లు ప్రకటించారు.

# పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

## పరిశీలకులు కాటమనేని భాస్కర్



తిరుపతిరూరల్, మార్చి07 ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాల్సి బాధ్యత అధికారులపై ఉందని పట్టభద్రుల నియోజకవర్గ పరిశీలకులు కాటమనేని భాస్కర్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులుగా (మైక్రో అబ్జర్వర్లు) గత ఎన్నికల అనుభవం ఉన్న సరే తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని చదివి, సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఉపాధ్యాయ నియోజకవర్గ పరిశీలకులు కోనా శశిధర్ అన్నారు. మంగళవారం స్థానిక మహిళ మహిళా విశ్వవిద్యాలయ సావేరి ఆడిటోరియంలో మైక్రో అబ్జర్వర్స్ శిక్షణ తరగతులలో ఎన్నికల పరిశీలకులు కాటమనేని భాస్కర్, కోన శశిధర్, కలెక్టర్ వెంకటరమణారెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొని, పలు సూచనలు చేసారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ శిక్షణా తరగతులలో సూచించిన సూచనలను తప్పని సరి అవగాహన చేసుకుని పాటించాలన్నారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్స్‌గా కేంద్ర ప్రభుత్వం పలు బ్యాంక్ అధికారు లను నియమించడం జరుగుతుందని, విధులు కేటాయించిన తర్వాత ఎట్టి పరిస్థితులలో గైర్హాజర కారాదన్నారు. జిల్లాలో తాను రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికలకు, మరోమూడు సార్లు పార్లమెంట్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా, పంజాబ్ ఎన్నికలకు అబ్జర్వర్‌గా, స్థానిక సంస్థల ఎన్నికలలో విధులు నిర్వర్తించడం జరిగిందని, ఆ అనుభవం మేరకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకులు సూచించిన విషయాలను మైక్రో అబ్జర్వర్స్ పాటించాలని, ఈనెల 12న డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు వద్ద ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ మెటీరియల్ తీసుకుని, పోలింగ్ కేంద్రాలకు వెళ్ళే సమయంలో మైక్రోఅబ్జర్వర్స్‌తో పాటు ప్రయాణించి రాత్రి బస చేయాల్సి ఉంటుందన్నారు. శిక్షణా కార్యక్రమంలో జె.సి. డికె బాలాజీ, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డిఆర్వో శ్రీనివాసరావు, మైక్రోఅబ్జర్వర్స్, కేంద్ర, రాష్ట్రబ్యాంకుఅధికారులు హాజరయ్యారు.

## ఉష్ణోగ్రతలు

7/3/2023



- తిరుపతి 32 డిగ్రీలు
- చిత్తూరు 33 డిగ్రీలు
- కుప్పం 31 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 33 డిగ్రీలు
- వెంకటగిరి 33 డిగ్రీలు
- గూడూరు 34 డిగ్రీలు

## బంగారం ధరలు

7/3/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,235

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,711

## కోడిగ్రుడ్ల ధరలు

7/3/2023



కోడిగ్రుడ్డు :రూ.5.50

1 డజను: రూ.66.00

# శాశనమండలి ఎన్నికల నియమావళి తప్పక పాటించండి

## - ఎంపిడిఓ శ్రీనివాస్ విశ్వనాథ్.

పెద్దపంజాణి మార్చి 7 ప్రభాతవార్త :
శాశనమండలి ఎన్నికలు మార్చి 13వ తేదీన జరగనున్న నేపథ్యంలో మండల అధికారులు,సిబ్బంది ఎన్నికల నియమావళిని తప్పకపాటిం చాలని ఎంపిడిఓ,నోడల్ ఆఫీసర్ మోడల్ కోడా ఆఫ్ కాండాక్ట తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్ పేర్కొన్నారు.కోగిలేరు గ్రామ సచివాల యాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి సిబ్బంది హాజరు రిజిష్టర్, పలురి కార్డులను పరిశీలించి తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వఉన్నత పాఠశాలలో ఉపాధ్యా యులు,పట్టబద్రుల శాశనమండలి ఎన్నికల కోసం వేరువేరు పోలింగ్



హాజరయ్యే సిబ్బందికి శిక్షణాతరగతులు నిర్వహించడం జరిగింద న్నారు.ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసామన్నారు.జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేసి ఎటువంటి అవాంచనీయ సంఘటనల జరగకుండా తగు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోగిలేరు పంచా యతీ కార్యదర్శి గణపతి,డిజిటల్ అసిస్టెంట్ జ్యోతిస్వరూప్, తదితరలు పాల్గొన్నారు.

## కారు.. ద్విచక్రవాహనం ఢీ.. వ్యక్తి మృతి

పెద్దపంజాణి, మార్చి 7 ప్రభాతవార్త



మండలంలోని ఎర్రదమ్మనపల్లి వద్ద మంగళవారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి చెందాడు. ఈసంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. కూరగాయల కొత్తవీరప్పల్లికి చెందిన జయరాం నాయుడు కుమారుడు భాస్కర్ నాయుడు (42) తన ద్విచక్రవాహనంలో చౌడేపల్లి వైపు వెళ్తుండగా వీరప్పల్లి పంచాయతీ ఎర్రదమ్మనపల్లి సచివాలయం ఎదుట కారు వచ్చి ద్విచక్రవాహనంను ఢీకొందని తెలిపారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ భాస్కర్ నాయుడును స్థానికులు చికిత్స నిమిత్తం 108లో హుటాహుటిన పలమనేరు ఆస్పత్రికి తరలించారు. అయితే మెరుగైన వైద్యం కోసం అతన్ని కుప్పం పిఇఎస్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## వైకాపానేత కోదండరామయ్య మృతి

పెద్దపంజాణి మార్చి 7 ప్రభాతవార్త :



వైకాపా సీనియర్ నేత,పెద్దపంజాణి ఎంపిపి రెడ్డెప్ప మేన మామ అయిన కోదండరామయ్య(65) మృతి చెందారు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవారు.ఈ నేపథ్యంలో మంగళవారం మృతి చెందారు.ఈయన మృతిపట్ల మాజీ ఎంపిపి వైకాపా రాష్ట్రకార్యదర్శి రెడ్డివారి విజయ్‌భాస్కర్ రెడ్డి,పలమనేరు ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వెంకటేగౌడ,జెడ్పీచైర్మన్ తనయుడు అమరనాథ్ తదితరులు ఆయనభౌతికాయనికి పూలమాలలువేసి నివాళులు అర్పించి తమ ప్రగాఢసంతాపం తెలియజేసారు.తన మేనమామ మృతిపట్ల కన్నీళ్ళుపెట్టుకున్న ఎంపిపి రెడ్డెప్పను ఎమ్మెల్యే వెంకటేగౌడ ఓదార్చారు.పార్టీ అభివృద్ధికోసం ఆయనచేసి నసేవలు మరువలేమని కొనియా డారు.వారి కుటుంబానికి అన్నివిదాలా అండగా ఉంటామని వారు పేర్కొన్నారు.వారితో పాటు పలువురు మండల వైకాపా నాయకులు ఆయన స్వగృహం వచ్చి ఆయన భౌతికాయనికి నివాళులర్పించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..ఆర్డీవో రామారావు

శ్రీకాళహస్తి, మార్చి 7 ప్రభాతవార్త



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీకాళ హస్తి ఆర్డీవో కెఎస్.రామారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా కమిషనర్ బి.బాలాజీనాయక్, ఎంఈవో భువనేశ్వరి, సిడిపిఓ శాంతిదుర్గ, మెప్మా సిటీ మేనేజర్ ఎన్.ప్రసాద్, డాక్టర్ రజన్న, న్యాయ సలహాదారులు రాజేశ్వరరావులు విచ్చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలోమహిళలను ఉద్దేశించి ఆర్డీవో రామారావు మాట్లాడుతూ ప్రాచీనకాలం నుంచి స్త్రీలకు అన్నింట్లోను మహిళలకు ప్రాముఖ్యత ఇస్తున్నారని ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం అన్నింటా సగం అంటూ ప్రశంసించారు. మహిళలేకపోతే సృష్టిలేదన్నారు. సృష్టికి మూలకారణం స్త్రీనే అన్నారు. మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లోరాణిస్తున్నారని ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న రుణాలును సద్వినియోగం చేసుకుని ఆర్థికస్వాలంభన సాధించాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, మల్లికార్జునయ్య, అరుణ్, ప్రజ్ఞశ్రీలు మాట్లాడుతూ మహిళలకు వర్తించే హక్కుల గురించి వివరించారు. మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందుతున్నారు. మహిళలకు ఏదైనా సాయం కావాలన్నా స్థానిక కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయసలహా కేంద్రంలో వినతిపత్రం అందించవచ్చన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన వారిని ఆర్డీవో రామారావు, కమిషనర్ బాలాజీనాయక్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాలకు నిప్పంటించిన దుండగులు

రామకుప్పం, మార్చి 7 ప్రభాతవార్త



మండలంలోని పులిమడుగు తాండాకు చెందిన రమేష్ నాయక్, సైరాజ్ నాయక్‌లకు చెందిన ద్విచక్రవాహనాలకు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో వాహనాలు దగ్ధమయ్యాయి. గ్రామంలోని ఇంటి ఆవరణలో రాత్రి ద్విచక్రవాహనాలు నిలిపి ఉంచగా నిప్పంటించారని బాధితులు పేర్కొన్నారు. లక్ష రూపాయలకు పైబడి నష్టం కలిగిందని ఈసంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## బిఆర్‌డి ఆస్పత్రిలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

కుప్పంరూరల్, మార్చి 7 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరంను నిర్వహించారు. నోవా సంతాన సాఫల్య కేంద్రం డా॥ ఆర్ లావణ్య మరియు డా॥ ఎం.హరితలు ఈసందర్భంగా సంతానం లేని అరవైమంది దంపతులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంతానం లేని పేద, మధ్య తరగతి దంపతులకు అంతర్జాతీయ ప్రమాణాలతో తక్కువ ఖర్చుతోనే స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్పింగ్ హ్యాండ్స్‌చే ఉచిత వైద్య శిబిరం

శాంతిపురం, మార్చి 7 ప్రభాతవార్త

రాళ్లబూదుగూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ బృందంచే మంగళవారం శ్రీ కోదండరామస్వామి రథోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. సుమారు 500మందికి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు విజయ్‌కుమార్, రజనీకాంత్, బిఎం సురేష్, శ్రీనివాసులు గౌడ, బసవరాజు, రాము, దిలీప్, సిరాజ్, కార్తీక్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా షబ్బేబరాత్ పర్వదినం

కుప్పం, మార్చి 7 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు మంగళవారం షబ్ ఎ బరాత్ పర్వదినంను ఘనంగా జరుపుకున్నారు. తమ కుటుంబాల్లో మృతి చెందిన పెద్దలకు దుస్తులు పెట్టి అల్లాహ్ పేరిట అన్నదానం జరిపారు. రాత్రి పూట మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ నెలకు ముందుగా వచ్చే షాబాన్ మాసంలో వచ్చే షబ్ ఎ బరాత్ పర్వదినం ఎంతో పవిత్రమైంది. ఈ రోజు రాత్రి అల్లాహ్ ఆరాధన చేస్తూ తాము చేసిన తప్పులను క్షమించమని వేడుకుంటే అల్లాహ్ తప్పక క్షమిస్తాడని, ముస్లిం సోదరులు సన్మార్గంలో పయనించాలని మత గురువులు సూచించారు.

## 10నుంచి శ్రీ అగ్నిమారెమ్మ ఉత్సవాలు

కుప్పంరూరల్, మార్చి 7 ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధి డికెపల్లి గ్రామదేవత శ్రీ అగ్నిమారెమ్మ ఉత్సవాలు ఈనెల 10వతేది నుంచి జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.10న అంకురార్పణం, ధ్వజారోహణం, కలశపూజ, అన్నదానం, 18న రథోత్సవం, 19న అగ్నిగుండం, పచ్చిగెరిగ, పుష్పపల్లకి, బాణవేడుకలు, 20న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నిరుద్యోగ వికలాంగ సంఘ జిల్లా అధ్యక్షుడు మురళీకి నంది పురస్కారం

చిత్తూరురూరల్, మార్చి 7 ప్రభాతవార్త:



తెలుగు రాష్ట్రాలలో ఉత్తమ సేవలందించిన వికలాంగ నాయకులకు విజయవాడ నందు వాసవిక్లబ్ సూపర్ స్టార్ ఆద్వర్యంలో నిర్వహించిన విశిష్ట పురస్కారం లో ఏపి నిరుద్యోగ వికలాంగుల సంఘాల జెఎసి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మురళీ నంది పురస్కారం అందుకొన్నారు. వికలాంగులకు వివాహాలు జరిపించడం, వికలాంగులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలపై కేసుల నమోదుకు కృషి చేసినందుకు నంది విశిష్టపురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా వుందని సేవాభావం పట్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. అలాగే వికలాంగుల శాఖ ఏడి శ్రీనివాసులు, వాసవి క్లబ్ సూపర్‌స్టార్ నిర్వాహకులు లలితారాణి, వికలాంగుల సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## తపాలా ఉచిత బీమా ఏజెంట్లకు ఇంటర్వ్యూలు

చిత్తూరురూరల్, మార్చి 7 ప్రభాతవార్త:

చిత్తూరు డివిజను పరిధిలోని చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, కుప్పం ప్రాంతాలలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవితా బీమా డైరెక్టు ఏజెంట్లుగా పనిచేయుటకు ఈనెల 15వ తేది ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తపాల సూపరింటెండ్ చెన్నకేశవులు ఒక ప్రకటనలో తెలిపారు. పదవతరగతి, ఇంటర్ విద్యార్హతతో 18-50 వయస్సు కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డులతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు రూ. 5వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా ఎన్ఎస్‌సి, కెవిపి అకౌంట్ ఖాతా తెరచి పాస్‌బుక్‌ను పూచీకత్తు రూపంలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 08572- 233522, 7989929864ను సంప్రదించాలని కోరారు.

## 11న సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, మార్చి 7 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈనెల 11న ఆదివారం సంకటహర గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11న ఉదయం 10 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొన వచ్చునని తెలిపారు. అలాగే సాయంత్రం 7 గంటలకు స్వామివారికి స్వర్ణరథోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు ఆలయ హుండీల లెక్కింపు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి యూనియన్ బ్యాంకు వారిచే హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు.

## గణనాధుని సేవలో కర్నాటక హైకోర్టు జడ్జి

కాణిపాకం, మార్చి 7 ప్రభాతవార్త:



కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.జి.పండిట్ మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొ న్నారు. ఆయన వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ సూపరెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హోలీ సంబరాలు

శాంతిపురం, మార్చి 7 ప్రభాతవార్త

శాంతిపురంలో మార్వాడీలు హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందోత్సాహాల మధ్య పండగను జరుపుకున్నారు. ఈసందర్భంగా దుకాణాలు మూతపడ్డాయి.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎన్‌బికెఆర్ క్రీడాకారుల ప్రతిభ



కోట, మార్చి 7 ప్రభాతవార్త

క్రీడల్లో ప్రతిభచాటిన ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థు లను మంగళవారం కళాశాల వ్యాయామ అధ్యాప కులు డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5, 6వ తేదీలలో ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 11వ జెఎన్‌టియుఏ అంతర కళాశాల క్రీడా పోటీల్లో సుమారు 1600 మంది 42 కళాశాలల నుంచి ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ఇందులో ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి క్రీడాకారులు ఏడు క్రీడల్లో గెలుపొందిన తమ ప్రతిభను చాటి బహుమతులు సాధించారని తెలిపారు. టేబుల్ టెన్నిస్‌లో జి.సంజీవ్‌కుమార్‌రెడ్డి, షటిల్‌లో ఎల్.సవ్యసాచిత్‌రెడ్డి, ఎస్.మనోజ్‌కుమార్, బాల్ బ్యాడ్మింటన్ మెన్స్, ఉమెన్స్‌లో విన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. అలాగే టేబుల్ టెన్నిస్‌లో రాకేష్‌నందన్, జి.సంజీవ్‌కుమార్‌రెడ్డి, నితిన్‌కుమార్, హ్యాండ్ బాల్‌మెన్, టేబుల్ టెన్నిస్‌లో వి.శిరీష, ఎల్.అంకితలు రన్నర్స్‌గా నిలిచారని అభినందించారు. జెఎన్‌టియుఏ స్థాయిలో తమ కళాశాల ఛాంపియన్‌షిప్ సాధించినందుకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల పెంపకంలోనే నేటి మహిళల భవిష్యత్తు

చిల్లకూరు మార్చి 7ప్రభాతవార్త

ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న ,అఘాయిత్యాలు, మారణాలు,తల్లిదండ్రులు పెంపకంలో నే నేటి మహిళల భవిష్యత్తు ఉందని చిల్లకూరు ఎస్ఐ బి .గోపాల్ అన్నారు.మంగళవారం వెలుగు కార్యాలయంలో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందుగా పొదుపు మహిళలు,మహిళా పోలీసులు,అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతు శాసనసభలలో చట్టాలలో మాట్లాడే హక్కును కల్పించింది డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని అన్నారు.ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో ముందున్నారని వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్దంగా ఉందని అన్నారు.మహిళల కోసం ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొని రావడం జరిగిందని అన్నారు.అనంతరం మహిళలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.ఈకార్యక్రమంలో ఏపిఎం గున్నయ్య,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి,రేణుక,సంఘ బంధం అధ్యక్షురాలు విజిత, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

గూడూరు, మార్చి 7 ప్రభాతవార్త



గూడూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఉమెన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రవిప్రసాద్ తెలిపారు. ఈ వేడుకలకు ఎస్ఐబి సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ.శేషమ్మ, సిఐ పి.విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకుంటారని, ఈ సంవత్సరం నేపథ్యం ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజి ఫర్ జెండర్ ఈక్వాలిటీ (లింగ సమానత్వం కోసం ఆవిష్కరణ మరియు సాంకేతికత) అని చెప్తూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవిప్రసాద్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళల సంఖ్య ఎంతగానో పెరిగిందన్నారు. ఇది మంచి పరిణామమని అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గత వారంరోజులుగా వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ, డాన్స్, సింగింగ్, ఫ్యాన్సీ డ్రెస్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు.

# విద్యార్థులు ఇష్టపడి చదవాలి

## - మండల విద్యాశాఖ అధికారి శైలజ



ఓజిలి, మార్చి 7 ప్రభాతవార్త

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిం చవచ్చని, లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని ఓజిలి మండల విద్యాశాఖ అధికారి శైలజ సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తోందని, విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధం కావాలని కోరారు. మంగళవారం ఆమె 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కోసం ఉన్నత చదువులకు 10వ తరగతి తొలి మెట్టు అని తెలిపారు. ఈ ఏడాది నిర్వహించే 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఓజిలి మండల పరిధిలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని కోరారు. ప్రాథమిక అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తే విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి గురికాకుండా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సబ్జెక్టులో పట్టు సాధించేందుకు ఏకాగ్రతతో చదువు దృష్టి సారించాలని తెలిపారు. ఎంత సమయం చదివామన్నది కాకుండా ఎంత శ్రద్ధతో చదువుతున్నామని గ్రహించాలని సూచించారు. వేకులజామున 5 నుంచి 7 గంటల మధ్య చదివిన పాఠ్యాంశాలు మెదడులో నిక్షిప్తమై మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. పరీక్షలకు ముందు నిర్వహించే ప్రీ ఫైనల్ పరీక్షల ఫలితాలు చూసుకొని పబ్లిక్ పరీక్షల్లో మరింత రాణించాలన్నారు. ఉత్తమ గ్రేడ్ లక్ష్యాన్ని సాధించాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉండాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అదనపు తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నూరుశాతం ఉత్తీర్ణత, మంచి గ్రేడ్లు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం

వాకాడు, మార్చి 7, ప్రభాతవార్త



సెబ్ కార్యాలయంలోని మంగళవారం సెబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట, వాకాడు, చిట మూరు మండలాల మహిళా పోలీసుల ను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మం డలంలోని అక్రమంగా మద్యం వ్యాపా రాలు, డ్రగ్స్, గంజాయి, గుట్కాలు, కోడి పందాలు, పేకాట స్థావరాలు పై ప్రతి ఒక్కరు నిఘా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా క్రైం విభాగాలలో ముందస్తు జాగ్రత్త ఉండి సంబంధించిన పై అధికారులకు తెలియజేయాలన్నారు. ఆయా మండలాల్లో మహిళా పోలీసులు పని చేస్తున్న పరిధిలో ఎప్పటికప్పుడు సమాచారం వచ్చేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిబ్బంది బాలసుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

## విద్యానగర్‌లో ఆత్మీయ సమావేశం

కోట, మార్చి 7 ప్రభాతవార్త



దివంగత నాయకులు, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వాకాడు నుంచి ఢిల్లీ స్థాయి వరకు తన రాజకీయ ప్రాబల్యాన్ని చాటుకోగా, కోటకు చెందిన దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి రాష్ట్రస్థాయిలో ప్రజల మధ్య ఉండి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న చరిత్ర ఈ ప్రాంతాలదని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో వైసీపీ ఆత్మీయ సమావేశం వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధనంజయరెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన శ్యాంప్రసాద్‌రెడ్డిని అందరూ గుర్తుపెట్టుకొని గెలిపించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిపి అంజమ్మ, జడ్పీటిసి కోటయ్య, వేమారెడ్డి షనీల్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, పాదర్తి రాధాకృష్ణారెడ్డి, చేవూరు నాగేశ్వరరావు, నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి, రాష్ట్ర వైసీపీ బీసీసెల్ జాయింట్ సెక్రటరి మణియాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, రాష్ట్ర ఎస్సీసెల్ జాయింట్ సెక్రటరీ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో నేషనల్ లెవల్ సింపోజియం




కోట, మార్చి 7 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మంగళవారం స్టూడెంట్ చాప్టర్ 11వ నేషనల్ లెవల్ సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పేపర్ ప్రజంటేషన్, పోస్టల్ ప్రజంటేషన్, మోడల్ ఎగ్జిబిషన్‌పై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించే దిశగా ఉండాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కన్వీనర్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్‌ను గుర్తించి ఒక మంచి ఆలోచనతో స్టూడెంట్ చాప్టర్‌ను 1999లోనే ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఎన్నో కార్యక్రమాలను దిగ్విజయంగా చేసినట్లు తెలిపారు. టెక్నికల్ క్విజ్, సెమినార్లు, నూతన ఆవిష్కరణల గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ హెచ్‌ఓడి డాక్టర్ విక్రమ్‌కుమార్, గ్రీష్మ,యశ్వని, శ్రీలక్ష్మి, మనోజ్ఞ, హేమానందిత, లక్ష్మిప్రియ, భారతి, హర్షిత, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య

చిల్లకూరు మార్చి 7ప్రభాతవార్త

మండలంలోని ముత్యాలపాడు గ్రామ పంచాయితీలో అరుందతీయవాడకు చెందిన గెద్దల మంజూల (28) మంగళవారం కుటుంబకలహాలతో ఇంట్లో ప్యానుకు ఉరివేసుకొని మృతి చెందింది.మృతురాలికి కుమారుడు,కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ బి గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టరం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు

# ఎన్నికల కోడ్ ఉల్లంగించిన మున్సిపల్ కమీషనర్‌పై చర్యలు తీసుకోవాలి

## -మాజి ఎంఎల్ఏ కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి మార్చి 7ప్రభాతవార్త

ఎంఎల్‌సి కోడ్‌ఉన్నా మున్సిపల్ కమీషనర్ వెంకట్రామయ్య సచివాలయ సిబ్బందిని,వాలంటీర్లను వైసిపి కార్యకర్తల సమావేశంకు పంపినందుకు ఆయన పై చర్యలు తీసుకోవాలని మాజి ఎంఎల్ఏ కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు.మంగళవారం నాడు ఆయన విలేకరు సమాశంలో మాట్లాడుతూ కమీషనర్ ఎన్నికల కోడ్ ఉన్నా చివాలయ సిబ్బంది,వాలంటీర్లను వైసిపి సమావేశంకు పంపినట్లు తెలిపారు.మావేశంకు పోకపోతే ఆతాలు ఇవ్వని హుకుం జారి చేసినట్లు తెలిపారు.కమీషనర్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఆయనపై చర్యలు తీసుకోక పోతే ఆందోళన



చేస్తామన్నారు.ఎంఎల్‌సి ఎన్నికలలో గెలవలేమన్న భయంతో ఓటర్లకు ఐదు వేల రూపాయల నగదు ఇస్తున్నన్నట్లు ఆరోపించారు.టిడిపి వారిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు.పరిశీలకులు శుక్లా లోహిత్ మాట్లాడుతూ వైసిపి పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు.నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులను కూడ ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. సమా వేశంలో మాజి ఎఎంసి చైర్మన్ పి రాజేశ్వరరావు,మాజి మున్సిపల్ చైర్మన్ బీరం రాజేశ్వర రావు, నాయరులు సత్యనారాయణ, గంగాదర్,ఆనంద్,చంద్రరెడ్డి,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## దేశ అభ్యున్నతికి..మహిళా శక్తి కీలకం -ఏపిఎస్‌పిడిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.ఎన్.బాబు

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 7 ప్రభాతవార్త:



దేశ అభ్యున్నతికి మహిళా శక్తి ఎంతో కీలకమని ఎస్‌పిడిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.ఎన్.బాబు,ప్రాజెక్ట్స్ అండ్ ఐటి డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డిలు కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపిఎస్‌పిడిసిఎల్)లో మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఎంతో సహనం,ఓర్పుతో ఒకవైపు ఇంటి బాధ్యతలు చూసుకుంటూ,మరోవైపు కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి తమవంతు తోడ్పాటునందించడం గర్వించదగ్గ విషయమన్నారు.మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్‌డి) డి.ఎస్.వరకుమార్,జాయింట్ సెక్రటరీ ఎ.రాధా జయశ్రీ,జనరల్ మేనేజర్లు పద్మ,శారద,పే ఆఫీసర్ గాయత్రీబాయి,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాసవిలత,పర్సనల్ ఆఫీసర్ సుబ్బలక్ష్మి,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీలక్ష్మి,స్వాతి,ఇతర మహిళా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ పట్టభద్రులపై చర్యలుతీసుకోవాలి

శ్రీకాళహస్తి, మార్చి 7 ప్రభాతవార్త

రాష్ట్రంలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలన్న దురుద్దేశంతో కొందరు తిరుపతిలో పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేయించిన నకిలీ పట్టభద్రులపై చర్యలుతీసుకోవాలని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు డిమాండ్ చేశారు. పదోతరగతి కూడా ఉత్తీర్ణులు కాని వారిని నకిలీ పత్రాలతో పట్టభద్రులుగా ధ్రువీకరించివేసి వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించి, వారి ఓట్లతో అడ్డదారిలో విజయం సాధించడానికి జగన్ అండ్ కో చేసిన దురాగతమని ఆరోపించారు. అనర్హులను ఓటర్లుగా నమోదు చేయడంలో ఎవరెవరి హస్తం ఉందో తేల్చడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఉమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరిగే శాసనమండలి ఎన్నికలలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వైసిపి ప్రభుత్వ సత్తా రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేదని ఉమేష్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న శాసనమండలి ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో పారదర్శకంగా జరిగేలా చూడాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఉమేష్ విజ్ఞప్తిచేశారు.

## మహిళలే మహారాణులు - లక్ష్మీపతిరెడ్డి

రేణిగుంట, మార్చి 7 ప్రభాతవార్త:



రాయల చెరువు పార్థు కిరణ్ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ లెటర్ సొసైటీ ఆధ్వర్యంలో విప్పమానుపట్టెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో రత్నమ్మ విచ్చేశారు. సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారన్నారు. మహిళలు లేకపోతే సృష్టి ఆగిపోతుందన్నారు. మహిళలను గౌరవించలేని సమాజం కాదన్నారు. మహిళలను పురుషులతో సమానంగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ, సచివాలయం, అంగన్‌వాడీ, స్కూల్ సిబ్బంది, వలంటీర్లు, పంచాయతీకి అనుబంధ మహిళలను సన్మానిస్తూ మెమెంటోలను అందజేసి కేక్ కట్ చేసి గౌరవించారు.

## రాయలసీమ పురాతన క్షేత్రాలు పెయింటింగ్ వేయాలి - రాజశేఖర్‌రెడ్డి

రేణిగుంట, మార్చి 7 ప్రభాతవార్త:



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో రాయలసీమ పురాతన క్షేత్రాలు కోటలు కట్టడాల గురించి ఫోటోలతో కూడిన సమగ్ర సమాచారాన్ని ఫ్లెక్సీలు వాల్ రేటింగ్ వేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రాయలసీమ టూరిజం పోస్టర్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రేణిగుంట రైల్వేస్టేషన్ బస్టాండ్‌లో రాయలసీమ పురాతన క్షేత్రాలు కోటలు కట్టడాల గురించి ఫోటోలతో కూడిన సమగ్ర సమాచారాన్ని ఫ్లెక్సీలు వాల్ రైటింగ్‌లను వేయాలన్నారు. దేశ వ్యాప్తంగా ఎంతో మంది భక్తులు తిరుమలకు వస్తుంటారన్నారు. సమాచారం తెలిస్తే సందర్శించడం ద్వారా పర్యాటక అభివృద్ధి జరుగుతుందన్నారు. స్థానికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట రైల్వే అధికారులు వినోద్‌కుమార్, రామయ్య, బాలాజీ, రమేష్ పాల్గొని పోస్టర్లు క్యాలెండర్‌లు విడుదల చేశారు.

## విద్యార్థి దశ నుండి సమానత్వపు హక్కుల కోసం కృషి చేయాలి.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్

చంద్రగిరి, మార్చి 7 ప్రభాతవార్త:



మహిళల సమానత్వపు హక్కుల కొరకు విద్యార్థి దశ నుండి కృషి చేయాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కశాశాలలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో స్వాలంబన సాధించాలని ఆకాంక్షించారు. మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నట్లు తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్ధులకు వ్యాస రచన, వక్తృత్వ, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్ధులకు బహుమతులు అందజేసి అభిందించారు. అంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్ధులు అలరించారు. ఈ ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ పి.భక్తవత్సలం, డాక్టర్ పి.నాగేంద్ర, డాక్టర్ టి.నరశింహారెడ్డి, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ చైర్మన్ పి.రజిని, సభ్యులు సి.అమ్మాజీ, కె.బి.జ్యోష్ణ, ఎం.రమ్య, టి.ఎన్.పద్మప్రియ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్ధులు పాల్గొన్నారు.

## మస్తానయ్య సతీమణి ఆకస్మిక మరణం

శ్రీకాళహస్తి, మార్చి 7 ప్రభాతవార్త



పట్టణంలోని గాంధీవీధిలో నివాసం ఉంటున్న ప్రముఖ న్యాయవాది వడకలూరు. మస్తానయ్య సతీమణి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు నిర్మల ఆకస్మికంగా మృతిచెందడంతో విషయం తెలుసుకున్న పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతోపాటు పలువురు పట్టణ ప్రముఖులు, న్యాయవాదులు నివాళులు అర్పించారు.

## టిప్పర్ ఢీకొని మహిళ మృతి

రామచంద్రాపురం, మార్చి 7 ప్రభాతవార్త:



దుర్గసముద్రం సమీపంలోని తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారిలో టిప్పర్ ఢీకొని మహిళ మృతి చెందిన విచాకర సంఘటన మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు.. సి.రామాపురంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం వుంటున్న వెంకటరమణ భార్య జి.నాగమణి (49) తన భర్తతో కలసి ఇంటి నుండి తిరుపతికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. దుర్గసముద్రం వద్ద వెళుతుండగా ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు గ్రావెల్ లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘనా స్థలికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## టిటిడి వాటర్ వర్క్స్ విభాగంలో మహిళా ఉద్యోగులను నియమించాలి.

బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కాయం హరినాథ్ రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 7 ప్రభాతవార్త:



టిటిడి వాటర్ వర్క్స్ విభాగంలో మహిళలకు కేటాయించిన ఉద్యోగ నియామకాలు వెంటనే చేపట్టాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కాయం హరినాథ్ రెడ్డి టిటిడిని డిమాండ్ చేశారు. మంగళవారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికీ మహిళలు అణగదొక్కబడుతున్నారని అన్నారు. టిటిడిలోని వాటర్ వర్క్స్ విభాగం నందు మహిళలకు 43 ఉద్యోగాలు కల్పించాలని 2010 సంవత్సరంలో పాలక మండలిలో తీర్మాణించినప్పటికీ నేటికీ అమలు చేయలేదన్నారు. మహిళా దినోత్సవాన్నిపురస్కరించుకుని టిటిడి పాలక మండలి, ఈఓ, నోటిఫికేషన్ ద్వారా కేటాయించబడిన మహిళా పోస్టుల నియామకాలను చేపట్టాలని కోరారు.

## ఉత్తమ సిడిపిఓగా ఫర్జానా

తొట్టంబేడు, మార్చి 7 ప్రభాతవార్త



తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓగా సమర్ధవంతంగా విధులు నిర్వహించిన ఫర్జానా జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి చేతులమీదుగా మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ సిడిపిఓగా అవార్డు అందుకున్నారు. 2019 డిసెంబర్‌లో తొట్టంబేడు సిడిపిఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమె ప్రాజెక్టుల నిర్వహణ, చిన్నారులకు, గర్భిణీస్త్రీలకు, బాలింతలకు ప్రభుత్వం నుంచి అందే పౌష్టికాహారాన్ని సక్రమంగా అంగన్‌వాడీకేంద్రాల ద్వారా పర్యవేక్షణ చేయడంలోను, మాతా శిశుమరణాలు తగ్గించేందుకు చేసిన కృషిని కలెక్టర్ కొనియాడారు. అనంతరం ఆమెను అభినందిస్తూ ఉత్తమ సిడిపిఓగా ప్రకటించి బహుమతిని అందించి సత్కరించారు. ఈసందర్భంగా సిడిపిఓ ఫర్జానా మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు సమాన భాగస్వామ్యంతోనే సమాజాభివృద్ధి సాధించాలని పురు షులకన్నా మహిళలు ఏమాత్రం తక్కువ కాదని వారితో పాటు సమాన గౌరవం దక్కినపుడే సమసమాజ అభివృద్ధి చెందుతుందన్నారు.ఈసందర్భంగా సిడిపిఓ ఫర్జానాను పలువురు అభినందించారు.

## గోవిందరావు పల్లిలో అగ్ని ప్రమాదం

శ్రీకాళహస్తి రూరల్,మార్చి 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం గోవిందరావు పల్లి పంచాయతీలోని మాదిరిపల్లి గ్రామమధ్యలో ఉన్న ఓ చింత చెట్టుకు మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.సంఘటన తెలిసిన వెంటనే జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి వినూత కోట అక్కడకు చేరుకున్నారు. అయితే ఈ చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు తగుల బెట్టినట్లు గుర్తించారు. ఈ చెట్టు తగలబడుతుంటే నిప్పులు జారి 4 ఇళ్ల మీద పడటంతో ఇళ్ళు కూలిపోయాయి.ఈ సమస్యను ఎంఆర్‌ఓకు చరవాణి ద్వారా చేరవేయటంతో గ్రామానికి అధికారులు చేరుకున్నారు.అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడకు వెళ్ళి మంటలను అదుపులోకి తెచ్చారు.చెట్టుకొమ్మలను తొలగించుటకు జనసేన ఇన్‌చార్జి వినూత రూ.5వేలు అందించారు.ఈ గ్రామంలో పాఠశాల ఉన్నా మూత పడిందని దాంతో ఇక్కడ చదువుకునే పిల్లలు సుమారు 3కిలో మీటర్ల నడచి వెళ్ళాల్సి వస్తుందని మహిళలు వినూతకు వివరించారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చి పరిష్కరిస్తామని వివరించారు.ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు దండి రాఘవయ్య, నాయకులు శ్రీనివాసులు, రవికుమార్‌రెడ్డి, బాలాజి, శివతదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడులో పార్టీలో చేరిన యువకులు

శ్రీకాళహస్తి రూరల్, మార్చి 7 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం మోదుగుల పాళెంకు చెందిన దేశం మద్దతు దారులు మంగళవారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సారధ్యంలోవైకాపా తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలో ప్రతి పక్షం లేని నియోజకవర్గంగా తీర్చి దిద్దుకోవాలన్నది లక్ష్యంగా శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తున్నారు.ఈ నేపధ్యంలో మోదుగుల పాళెంకు చెందిన మాజీ సర్పంచ్ రంగయ్య, తన అనుచరులతో పార్టీ కార్యాలయంలో సభ్యత్వంతీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల వైకాపా ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి మోదుగుల పాళెం ఇన్‌చార్జి రాజేంద్రన్, మహిళా అధ్యక్షురాలు మంచు సురేఖ, శ్రీహరి నాయుడు గుండాల చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## చదలవాడ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

తిరుపతి (క్రీడ), మార్చి 7, ప్రభాతవార్త



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను తిరుపతి రేణిగుంట మార్గమధ్యంలోని చదలవాడ విద్యా సంస్థల్లో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిమ్స్ హాస్పిటల్ రేడియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ విజయలక్ష్మి , చదలవాడ విద్యాసంస్థల చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి కుమార్తె చదలవాడ కవిత, విద్యా సంస్థల డైరెక్టర్ భాస్కర్ పటేల్,రంగనాథ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల్లోని మహిళలకు విద్యార్థులకు గత వారం రోజులుగా సాంస్కృతిక, నృత్య పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేసారు. అనంతరం ముఖ్య అతిధి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నేడు అన్ని రంగాలలో మహిళలు రాణిస్తుండడం శుభ పరిణామం అని అదే విధంగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## ఐఎఫ్‌టియు 7వ జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం!

-రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ పిలుపు

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 7 ప్రభాతవార్త:




అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) 7వ జాతీయ మహాసభలు ఏప్రిల్ 16,17, 18 తేదీలలో తిరుపతిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ ఎత్తున నిర్వహిస్తున్నందున,దీనికి అన్ని వర్గాల ప్రజలు తమ సహాయ సహకారాలు అందించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరి కృష్ణ పిలుపునిచ్చారు.మంగళవారం స్థానిక నారాయ ణిపురంలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో జాతీయ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను నాయకు లతో కలిసి ఆవిష్కరించారు.అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ 16వ తేదీ ఉదయం 10 గంటలకు నగరంలో భారీ ఎత్తున కార్మికులు,కర్షకులు, కళాకారులు,ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించిన తరువాత 11 గంటలకు స్థానిక ఇందిరామైదానంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు.17,18 తేదీలలో ప్రతినిధుల సభ నిర్వహిస్తామని ఆయన వివరించారు కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్రహ్మణ్యం,నాయకులు కె.విజయ్‌కుమార్,మునికుమార్,వెంకటేష్,ఏపి ప్రగతిశీల అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొబీనా,జిల్లా కమిటీ సభ్యురాలు జీవిత, తిరుపతి అధ్యక్షురాలు నాగరత్న,పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిశేషు,టౌన్ కన్వీనర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో పెచ్చుమీరుతున్న బోగస్ ఓట్ల దందా!

-నెహ్రూనగర్ వైసిపి కార్యాలయంలోనే 36 దొంగ ఓట్లు

-సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 7 ప్రభాతవార్త:

తిరుపతి నగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపి పార్టీ నేతల జోక్యం కారణంగా బోగస్ ఓట్ల దందా రోజు రోజుకూ పెచ్చుమీరి పోతోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మండిపడ్డారు.స్థానిక నెహ్రూనగర్‌లోని వైసిపి కార్యాలయంలో 36 దొంగ ఓట్లు నమోదయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.పోలింగ్ బూత్ 232లో 4-4-562 ఇంటి నెంబరుతో ఈ ఓట్లు నమోదు అయ్యాయన్నారు.ఒకే నెంబరుతో 36 ఓట్లు నమోదు కావడం,ఇందులో హిందు,ముస్లిం,క్రైస్తవ పేర్లు కూడా ఉండటం వారి లెక్కలేని తనానికి నిదర్శనమన్నారు.కనీస విచక్షణ ఉన్న ఏ ఒక్క అధికారైనా సరే దీనిని అంగీకరించరని,తిరస్కరించి ఉండాల్సిందన్నారు.అధికార యంత్రాంగం మొత్తం అధికార పార్టీ చేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోయారనడానికి ఇది తార్కాణమని అన్నారు.ఎన్నికల సంఘం బోగస్ ఓట్లను ఏరివేయాలని,సంబంధిత అధికారులపై కఠినంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి విద్యార్థి విభాగం అధ్యక్షుడు సూరి ఘన సన్మానం

చంద్రగిరి, మార్చి 7 ప్రభాతవార్త:



తిరుపతి రూరల్ మండల ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని చంద్రగిరి మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు సూరి ఘన సన్మానం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం తిరుపతి, కడప జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన సందర్భంగా మంగళవారం దుశ్శాలువ అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు.

## సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆర్థిక సహాయం

వడమాలపేట, మార్చి 7 ప్రభాతవార్త:



మండలంలోని ఓబీఆర్ కండ్రిగ ఎస్టీ కాలనీలో ఇటీవల మృతిచెందిన సుబ్రహ్మణ్యం కుటుంబానికి చారిట బుల్ ట్రస్టు ద్వారా రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల చేపల వేటకై వెళ్లిన సుబ్ర హ్మణ్యం ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయి మృతి చెందారు. మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఓబీఆర్ కండ్రిగ ఎస్టీ కాలనీకి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి రోజా ఆదేశాల మేరకు రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా సుబ్రహ్మణ్యం భార్య అమ్ములుకి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఓబీఆర్ కండ్రిగ సర్పంచ్ శ్రీవిద్య, వైసీపీనాయకులుమునిబాబు,రమేష్‌రాజు,వెంకటరెడ్డి,రాజశేఖర్,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కార్యకర్తలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

– టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ డిమాండ్

కేవీబీ పురం, మార్చి 7 ప్రభాతవార్త:



బీసీ బడుగు బలహీన వర్గాలు కార్యకర్తలపై కత్తులతో హింసాత్మకమైన చర్యలు జరుగుతున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రాగిగుంట పంచాయతీలో కత్తి పోటుకు గురై తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఢిల్లీబాబు అనే టీడీపీ కార్యకర్త ఇంటి వద్ద జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్ అధ్యక్షతనకార్యక్రమం ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామానుజనాయుడు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో హింసాత్మక పాలన అరాచకపాలన నడుస్తుందని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై ఎక్కడ పట్టిన దాడులు చేస్తున్నారని వాపోయారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి అరెస్టు చేయాలని నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. నరసింహయాదవ్‌తో పాటు సత్యవేడు టీడీపీ మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె హెలెన్ హేమలత, అధ్యక్షుడు రామానుంజన్‌నాయుడు, మునస్వామి యాదవ్, జిల్లా రైతు కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి, లక్ష్మిపతిరాజు, టీడీపీ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, తిమ్మసముద్రం పంచాయతీ సర్పంచ్ గుర్రం దొరబాబునాయుడు, జిల్లారైతు ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, కేశవులనాయుడు, లోకినాయుడు, హరి, రమణయ్య, మునికృష్ణ, రమణయ్య, భాస్కర్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్వి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

తిరుపతి (క్రీడ), మార్చి 7, ప్రభాతవార్త

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల 137వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన దేవస్థానం విద్యాశాఖ అధికారి డా.ఎం. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసారు. ప్రధానోపాధ్యాయురాలు జె. సంధ్య వార్షిక నివేదికను వినిపించారు. హెచ్‌డిపిపి కోఆర్డినేటర్ డా. ఇజి హేమంత్ కుమార్, పిజికల్ డైరెక్టర్ కుమార్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కె. చంద్రశేఖర్, పూర్వ విద్యార్థి ఎ. సంత్ కుమార్, టేక్వాండో కోచ్ గోపినాయుడు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 60 వేల నగదు బహుమతులు అందజేసారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ మంజూరు

తిరుపతి (విద్య), మార్చి 7, ప్రభాతవార్త



భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ నుంచి రూ. 2 కోట్లు మంజూరు చేసినట్లు ఎస్ఎస్ఐఐఈ టీబీఐ కార్యదర్శి ఆచార్య ఎస్. జ్యోతి తెలిపారు. 2022 - 2023 సంవత్సరానికి మొదటి విడతగా రూ. 84 లక్షలు ఎస్ఎస్ఐఐఈ టీబీఐ అందుకుంది. ఈ పథకం కింద బెంగళూరులోని సర్వే రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సీడ్ ఫండింగ్ మానిటరింగ్ కమిటీ స్టార్టప్‌లలో ఒకటిగా ఎంపిక చేసింది. బెంగళూరులోని సర్వా రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు ఆర్. శ్వేతను రిజిస్ట్రార్ ఎన్ రజనీ అభినందించారు. ప్రసవానంతర డిప్రెషన్ దృష్టి సారించిన ప్రోటోటైప్ అభివృద్ధి కోసం స్టార్టప్‌కు వీలుగా మొదటి విడత చెక్కును అందజేసారు. డెలివరీ తర్వాత కొంత మంది మహిళలు ప్రసవానంతరం నిరాశను అనుభవిస్తారు. వీటిలో సాధారణంగా మూడు స్వింగ్స్, ఏడుపు, ఆందోళన, నిద్రలో ఇబ్బంది, దీర్ఘకాలిక నిరాశ భాధ వుంటుంది. కాన్సెప్ట్ ప్రొటోటైప్ డెవలప్మెంట్, ప్రొడక్ట్ ట్రయిల్స్, మార్కెట్ ఎంట్రీ, వాణిజ్యీకరణ కోసం స్టార్టప్లకు ఆర్థిక సహాయం అందించడానికి సీడ్ ఫండ్ ఉపయోగపడుతుందని ఎస్ఎస్ఐఐఈ టీబీఐ సిఈఓ డా. సూర్యకుమార్ పేర్కొన్నారు. దీంతో ఈ స్టార్టప్‌లు ఏంజెల్ ఇన్వెస్టర్లు లేదా వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులను సమీకరించే స్థాయికి చేరుకోగలుగుతాయి. రెండేళ్ల గడువు డిపిఐఐటీ గుర్తింపు పొందిన స్టార్టప్ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

## విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్‌కు అంతర్జాతీయ అవార్డు

తిరుపతి (విద్య), మార్చి 7, ప్రభాతవార్త



తిరుపతి విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎన్. తులసి విశ్వనాధ్ రెడ్డికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ మనం పౌండేషన్ వారు వరల్డ్ గోల్డ్ హ్యుమానిటేరియన్ ఉమెన్ అవార్డు 2023 పురస్కారానికి ఎంపిక చేసారు. మనం పౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ విద్యా, సేవ రంగంలో తులసి కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఆమె ప్రతిభకు గుర్తింపుగా ఈఅవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాధ్ రెడ్డి, స్కూల్ ఉపాధ్యాయ బృందం తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఢిల్లీని పరామర్శించిన సర్పంచ్ దొరబాబు

కేవీబీ పురం, మార్చి 7 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలోని రాగిగుంటలో కత్తిపోటుకు గురైన ఢిల్లీబాబును తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబు పరామర్శించారు. రాగిగుంటకు చెందిన ఢిల్లీబాబు కత్తిపోటుకు గురై ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఢిల్లీబాబును మాజీ మండల అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మునస్వామియాదవ్, తిరుపతిపార్లమెంట్ యువత అధికార ప్రతినిధి లోకేష్‌చౌదరి, పార్లమెంట్ రైతు కార్యదర్శి హరినాయుడు, రాగిగుంట ప్రధాన కార్యదర్శి మస్తాన్ తదితరులు ఉన్నారు.

## రాయపేడు గ్రామంలో నవధాన్యాలపై అవగాహన

కేవీబీ పురం, మార్చి 7 ప్రభాతవార్త:

నవధాన్యాలు వేయడం వలన పంటలు బాగా పండుతుందని, దిగుబడి బాగా వస్తుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ రైతులతోప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతులు మహిళల ఇళ్ళ వద్దనే 32 రకాల ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి పంటలు తక్కువ పెట్టుబడితో సాగు చేయవచ్చని పరిపూర్ణమైన ఆరోగ్యం పొందుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గణేష్ వసంతరావు, జకర్య, సంపూర్ణ పాల్గొన్నారు.

## రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

కేవీబీ పురం, మార్చి 7 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలోని అంగేరి చెరువు వద్ద అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు అధికారి జి.విజయకఉమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన రహస్య సమాచారం మేరకు కేవీబీ పురం మండలంలోని అంగేరి చెరువు గ్రామం వద్ద అక్రమ రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న రెండు టన్నుల రేషన్ బియ్యంతో పాటు కాళంగి గ్రామానికి చెందిన ఎం.అశోక్ అనే వ్యక్తిని అరెస్టుచేసి కేవీబీ పురం పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ నాయక్, హెడ్ కానిస్టేబుల్ జయరాంరెడ్డి, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో షబ్బెబరాత్ ప్రార్థనలు

శ్రీకాళహస్తి,మార్చి 7 ప్రభాతవార్త



రంజాన్‌కు 15 రోజుల ముందు షాబాన్ మాసంలో 'షబ్బెబరాత్' రాత్రిగా భావించి నాడు మహమ్మద్ ప్రవక్త ఆచరించిన విధానాలను ఆచరిస్తూ రాత్రి ప్రార్థనలను జరిపారు.మంగళవారం రాత్రి మసీదుల్లో ఆలస్యంగా ప్రార్థనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జామియా మస్‌సిద్‌లో హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్, నూర్ మస్‌జిద్‌లో మహామ్మద్ అలి,యూసుఫ్ మస్‌జిద్‌లో హాఫీజే ఖుర్ ఆన్ నసీంఅఖ్తర్‌ల సారధ్యంలో ప్రార్థనలు జరిపారు.ఈ సందర్భంగా మత గురువులు తమ ప్రసంగాల్లో ఈ రాత్రి ప్రతి ఒక్కరుభక్తిభావంతో అల్లాహ్‌ను ధ్యానించి తాము జీవితంలో తెలిసి తెలియక చేసిన పాపాలను మన్నించాలని వేడుకోవాలని సూచించారు. ఈ షబ్బెబరాత్ గురించి ఎక్కడా స్పష్టంగా లేదన్నారు.ఈ రాత్రి మన ప్రవక్త దేవుని పలకరించటానికి వెళ్ళివచ్చిన రాత్రి అని కొన్ని గ్రంధాల్లో పేర్కొనబడి ఉందన్నారు.ఈ రాత్రి ఎవరికి తోచిన విధంగా వారు అల్లాహ్ ధ్యానంలో గడపాలని, నమాజుల్లో గడపాలని వివరించారు. అయితే ఉదయం నమాజును విస్మరించరాదని వివరించారు. ఇస్లాం మత వ్యాప్తి కోసం ఈమాన్ కోసం తమ సంతతికి పరిమితంగా నమాజులను ఆచరించుటకు వీలుగా అల్లాహ్‌ను ప్రార్థించారన్నారు.అలాంటి పవిత్రమైన రాత్రిని సద్దినియోగం చేసుకోవాలన్నారు.మన ప్రవక్త ఆచరించిన విధానాలను ఆచరించి మానసిక శాంతిని పొందాలని సూచించారు. మనం మన పూర్వీకులు ఆచరించిన విధి విధానాలను విస్మరిస్తున్నాము. దాంతో అల్లాహ్ వరాలకు దూరంగా ఉంటున్నామన్నారు.

# పాండురంగస్వామి ఉత్సవంలో పాల్గొన్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు, మార్చి 6 ప్రభాతవార్త



మండలంలోని చేమూరు గ్రామంలోని పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి కుమార్తె తొట్టంబేడు మండల ఇన్‌ఛార్జి బియ్యపుపవిత్రారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమెకు వైకాపా నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పాండురంగస్వామి ఉత్సవాలు, మాతమ్మ కొలుపులు, శ్రీరామమందిరాల్లో పూజలు నిర్వహించడం సంప్రదాయాలకు నిలయం అన్నారు. అనంతరం పవిత్రారెడ్డిని సత్కరించి స్వామివారి ప్రసాదాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు గంగరామిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, గురవారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి, మునిరాజరెడ్డి, వెంకటరెడ్డి, అంకయ్య, కెవి.రాజయ్య, గిరిబాబు, జయచంద్రరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సుబ్బయ్య, మంగిరెడ్డి, పెంచలయ్య, మురళీ, చలపతి, చంద్ర, నారయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం



కాణిపాకం, మార్చి 7 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో మంగళవారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈమేరకు ఉదయం ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అలాగే రాత్రి అలంకరించిన స్వామి, అమ్మవార్లను గరుడవాహనం వుంచి గరుడ సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ఏకం ఆశ్రమంలో అమ్మాభగవాన్ 74వ జన్మదిన వేడుకలు

వరదయ్యపాళెం,మార్చి 7 ప్రభాతవార్త : మండల కేంద్రానికి సమీపం లోని బత్తల వల్లం వద్ద వెలసిన ఏకం ధార్మిక ఆశ్రమంలో వ్యవస్థాపకులు అమ్మాభగవాన్ 74వ జన్మదిన వేడుకల సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం భారీ ఎత్తున ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు దేశ విదేశాల నుంచి భారీ ఎత్తున అతిథులు తరలి వచ్చారు.అంతేకాక బాలివుడ్,టాలీవుడ్ కోలీవుడ్ సెలబ్రిటీలతో ఏకం పరిసరాలు సంబరాల్లో మునిగిపోయారు.సుమారు 20 సంవత్సరాలుగా ఈ ప్రాంతాల్లో అమ్మాభగవాన్ ఆశ్రమం ఏర్పాటు చేసి చుట్టు పక్కల గ్రామాల అభివృద్ధికి తమ వంతు సేవలందిస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఏకం అనే ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ఇక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఏకం సారథ్యంలో విద్యార్థులకు వెసులుబాట్లు కల్పిస్తున్నారు.



ఏకంలో వికలాంగులకు వితరణ అందిస్తున్న దృశ్యం

**జన్మదిన వేడుకల్లో సామాజిక సేవలు:**

అమ్మాభగవాన్ 74వజన్మదిన సందర్భంగా నిర్వాహకులు భారీ ఎత్తున కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.ఓ వైపు దీక్షలు,మరో వైపు వచ్చిన భక్తులు ధ్యానాలు చేయటం, మరో వైపు జన్మదిన సంబరాలు మిన్ను ముట్టాయి. ఇక ట్రస్టుకు సంబంధించిన లోకేష్‌దాసాజి సారధ్యంలో పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మాభగవాన్ సంతానం కృష్ణాజీదాసాజి చేతులమీదుగా వికలాంగులకు 13 ట్రైసైకిల్స్ ను 13 వీల్‌ఛైర్స్‌ను 8 క్రచర్స్, 24 మందికి చెవిటి మిషన్లు, 2వాకర్లు 91 బ్లయిండ్ స్టిక్స్ ఒక యాలో జిస్టిక్స్, రెండు వాకర్లు ఎంపిక చేసిన వికలాంగులకు అందజేసారు. ఇక్కడ పాల్గొన్న పలువురు మాట్లా డుతూ అమ్మాభగవానుల దీక్షలతో సకల రోగ నివారణ ఐశ్వర్యం, రైతులు పాడిపంటలతో మహిళలు పసుపు కుంకుమాలతో సుఖంగా జీవించాలని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.కృష్ణాజీ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో తమ వంతు సమాజిక సేవలందిస్తున్నందుకు తమకు ఎంతోషంగా ఉందని వివరించారు. ఇంత మంది ఆశీర్వదాలు అమ్మాభగవాన్‌కు ఉంటుందని వివరించరు. ఈకార్యక్రమా ల్లో లోక ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు లోకేష్‌దాసాజి జనరల్ మేనేజర్ సునీల్ జి.ట్రస్ట్ ప్రతినిధి ఉమాపతి దాసాజి, డిఎస్‌పి జగదీష్‌నాయక్,సిఐలు శ్రీనివాసులు, శివకుమార్‌రెడ్డి ఎస్‌ఐలు నాగార్జున్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి,హనుమంతప్ప,స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ తిలక్‌బాబు, సిఎల్‌ఎన్‌పల్లి సర్పంచ్ వేణుగోపాల్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌లు అబ్దుల్ లతీఫ్, ప్రసాద్, సర్పంచ్ రమణయ్య, ఉదయ్‌కుమార్, లక్ష్మీనారాయణ,గుత్తి త్యాగరాజులు పాల్గొన్నారు.

## మహిళలు హక్కులతో పాటు బాధ్యతలు కూడా నిర్వహించాలి



పుత్తూరు, మార్చి 7 ప్రభాతవార్త : మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతూనే బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించాలని పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి జి.సరోజమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి.ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల కడుపులో పడినప్పటి నుంచి ఆఖరి శ్వాస సవరకూ ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ దేవతలు నివశిస్తారని తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మెహరున్నీసా మాట్లాడుతూ స్త్రీలకు విద్య ద్వారా చైతన్యం, ఆర్థిక స్వేచ్ఛ కలుగుతుందన్నారు. అనంతరం కాలేజీలో 14 మంది ఉత్తమ విద్యార్థుల మాతృమూర్తులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సాధికార విభాగం కన్వీనర్ డాక్టర్ కందేరి శ్రీదేవి, కార్యక్రమ సమన్వయకర్త టి.నరసింహులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య, ఇంకా అధ్యాపకులు డాక్టర్ విష్ణుప్రకాష్, నాగేశ్వరరావు, డాక్టర్ ఎ.దేవకి, డాక్టర్ పి.కుమారి నీరజ, డాక్టర్ వి.వాసవి, డాక్టర్ ఎం.ఉషారాణి, కె.రాధిక, డాక్టర్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## శిరోముండనం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

**మరో ముగ్గురు పరారీ : సిఐ ఓబులేష్**



చంద్రగిరి, మార్చి 7 ప్రభాతవార్త: ఆటో డ్రైవర్ వంశీ శిరోముండనం కేసులో ఇద్దరు నిందితులు హర్షా రెడ్డి, అన్వర్‌లను అరెస్ట్ చేసినట్లు సిఐ ఓబులేష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సిఐ వెళ్ళడించిన వివరాల మేరకు.. ఆరేపల్లి రంగంపేటకు చెందిన వంశీ భార్య రమాదేవితో చంద్రగిరికి చెందిన ఫైనాన్షి యర్ హర్షారెడ్డి వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఈ నేపథ్యంలో కొంత కాలం క్రితం రమాదేవి ఇంటి నుండి వెళ్ళిపోయి హర్షా రెడ్డితో సహజీవనం చేస్తూ వారి ఫోటోను ఫేస్‌బుక్‌లో పెట్టడంతో వంశీ గమనించి హర్షా రెడ్డి, అతనికి సహకరించిన అన్వర్‌కు రిప్ అంటూ పోస్టు పెట్టాడు. దీంతో ఆగ్రహించిన నిందితులు హర్షా రెడ్డి, అన్వర్, వేణుగోపాల్, హరినాథ్, మునివెంకటేష్ కలిసి బెంగుళూరులో వుంటున్న వంశీని కిడ్నాప్ చేసి చంద్రగిరికి తీసుకువచ్చారు. రాయలపురం సమీపంలోని బీడు భూముల్లో వంశీ తీవ్రంగా కొట్టడంతో పాటు ద్విచక్ర వాహనం సైలెన్సర్‌తో శరీరంపై కాల్చారు. అయినప్పటికీ తమ కోపం తీరకపోవడంతో బాధితుడు బ్రతిమలాడుతున్నప్పటికీ బలవంతంగా గుండుగీయించారు. తమపై పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఎవరికైనా చెప్పినా చంపేస్తామంటూ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఇంత జరిగినా బాధితుడు వంశీతో క్షమాపణలు చెప్పిస్తూ విడియోలు తీసి వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. దీంతో కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఐ ఓబులేష్ రంగంపేటలోని బాధితుడికి భరోసా కల్పించి ఫిర్యాదు తీసుకున్నారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన ఐదుగురు నిందితులలో ఇద్దరిని అరెస్ట్ చేసి, మిగిలిన ముగ్గురి కోసవ గాలింపు చేపట్టారు. ఈ సమావేశంలో ఎస్ఐ వంశీధర్, ఎస్ఐలు సుధాకర్, టి.గుర్రప్ప, హెడ్ కానిస్టేబుళ్ళు యల్లప్ప, బసవయ్య కానిస్టేబుళ్ళు రవికుమార్, కృష్ణమూర్తి, గోపి, వై.నాగరత్న, హోమ్‌గార్డ్‌లు భాషా, రెడ్డెప్ప పాల్గొన్నారు.

## 'తెర' మరుగు



సూళ్లూరుపేట, మార్చి 7 ప్రభాతవార్త : సూళ్లూరుపేట ప్రాంత ప్రజలకు, సినీ అభిమానులకు కొన్నేళ్లుగా ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందించి వినోదాన్ని పంచి తియ్యటి అనుభూతులను మిగిల్చి ప్రస్తుతం కనుమరుగవుతోంది. ఒకప్పటి శ్రీవెంకటేశ్వర థియేటర్, మొన్నటి రాయల్ థియేటర్, ఇప్పటి ఎన్‌విఆర్ సినిమా పేట సినిమా ప్రియులకు వీడ్కోలు చెబుతూ 'తెర'మరుగవుతోంది. కొత్త సినిమా వచ్చిందంటే ఎడ్ల బండిపై బ్యాండుమేళాలతో ప్రచార సందడి, ముక్కోటి ఏకాదశి, మహాశివరాత్రి పర్వదినాలకు మూడు ఆటల వినోదాన్ని పంచిన ఈ సినిమాతల్లి శాశ్వతంగా కాలగర్భంలో కలిసిపోతోంది. కాగా, తీపి జ్ఞాపకాలను మాత్రం సినీ ప్రియులకు మిగిల్చి వెళుతోంది. ఇక్కడి సినీ అభిమానులు, ఈ ప్రాంత ప్రజలు ఒకసారి కూల్చివేస్తున్న ఎన్‌విఆర్ సినిమా థియేటర్‌ను చూసి పాత స్మృతులను గుర్తు చేసుకుంటున్నారు.

## ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు, మార్చి 7 ప్రభాతవార్త: జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ పరీక్షల పక్కా నిర్వాహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియేట్ పరీక్షల సజావు నిర్వహణ కోసం మంగళవారం డిఆర్‌ఓ రాజశేఖర్ వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 15 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియేట్ పరీక్షలకు 31,576 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్షల కోసం 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 17,366, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 14,210 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు ఉదయం 7 గంటలకల్లా పరీక్షా కేంద్రాల్లోకి వుండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియేట్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఎదైనా ఇబ్బందులు వుంటే కంట్రోల్ రూమ్ నెం.1800-4257-635, ఆర్‌ఐఓ కార్యాలయ హెల్ప్‌లైన్ నెం. 88854 19096, 86885 95909 నెంబర్లను సంప్రదించి పరిష్కరించుకోవచ్చునన్నారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు సూళ్లూరుపేట చిన్నారి



సూళ్లూరుపేట, మార్చి 7 ప్రభాతవార్త : రాష్ట్రస్థాయిలో ఈ నెల 10, 11, 12 తేదీలలో విజయనగరం జిల్లాలోని యలమంచిలిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు సూళ్లూరుపేటకు చెందిన చిన్నారి ఆర్.దేవిశ్రీ ఎంపికైంది. నెల్లూరులో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో యు-26 వెయిట్ కేటగిరిలో సూళ్లూరుపేటకు చెందిన ఆర్.దేవిశ్రీ ప్రథమస్థానం సాధించింది. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఈ చిన్నారిని ఎంపిక చేసినట్లు నెల్లూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు. సూళ్లూరుపేటకు చెందిన దేవిశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల తైక్వాండో కోచ్ యు.ప్రవీణ్‌కుమార్, సి.సాయి, యు.పవన్‌లు అభినందనలు తెలియజేశారు.

## ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

**- ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్, కాటమనేని భాస్కర్‌లు**

చిత్తూరు, మార్చి 7 ప్రభాతవార్త: ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేలా పక్కా ఏర్పాటు చేపట్టాలని ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్, కాటమనేని భాస్కర్‌లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో మంగళవారం ఎన్నికల పరిశీలకులు ఎన్నికల కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అన్నారు. ఎన్నిక సంఘం పలు బ్యాంకు అధికారులను సూక్ష్మ పరిశీలకులుగా నియమించడం జరిగిందని, వీరు ఎన్నికల విధులను ప్రవర్తనా నియమావళిని అనుసరించి పక్కాగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులకు ఎలాంటి మినహాయింపులు వుండవన్నారు. అలాగే సూక్ష్మ పరిశీలకులు సైతం ఎక్కడ పొరబాట్లకు అవకాశం లేకుండా ప్రిసైడింగ్ అధికారిని సమన్వయం చేసుకొని పక్కాగా నివేదిక ఇవ్వాల్సి వుంటుందన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు కేటాయించిన విధులను పక్కాగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్షా ఎపిసి వెంకట రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానవజాతి మనుగడకు ప్రాణం పోసింది మగువలే

**- ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి - ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం**



కుప్పం, మార్చి 7 ప్రభాతవార్త : సమాజంలో మానవజాతి మనుగడకు ప్రాణం పోసింది మగువలేనని ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ ఎకె వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపకులపతి ఆచార్య రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ మానవజాతి మనుగడ స్త్రీమూర్తులపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీ మూర్తి ఉందన్నారు. ప్రస్తుతం స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడం హర్షణీయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలు స్త్రీ జాతి పట్ల గౌరవాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. రెక్టార్ ఆచార్య అనురాధ మాట్లాడు తూ ఒక స్త్రీ ఉద్యోగ, చదువు రీత్యా బయటకు వచ్చినసమయంలో వారు ఎదుర్కొనే హేయమైన చర్యలు వివరించారు. సమాజంలో దిగజారుతున్న విలువల గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించి ఆలోచనా ధోరణులు మార్చుకోవాలన్నారు. చిత్తూరు పోక్సో కోర్టు మాజీ పి.పి. లీలావతి మాట్లాడుతూ వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య లోకనాథం , ఆచార్య సత్యవాణి, ఆచార్య యశోద, మహిళా విభాగం కో ఆర్డినేటర్ డా॥ శోభారాణి, అదనపు కో ఆర్డినేటర్ డా॥ కళావతి, రిజిస్ట్రార్ సతీమణి ఆకేపాటి మాధురి, బోధన, బోధనేతరసిబ్బంది, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీకోదండరాములోరి రథోత్సవం



శాంతిపురం, మార్చి 7 ప్రభాతవార్త : మండలంలోని రాళ్లబూదుగూరులో వెలసిన శ్రీ కోదండరామ స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనాదిగా వస్తున్న రాతిచక్రాల రథంను వివిధ రకాల పుష్పాలతో అల ంకరించి ఈ రథంలోనే పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. భక్తులకు పలుచోట్ల పానకం, పెసరపప్పు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవం కార్యక్రమంకు చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. సాయంత్రం ధూళి ఉత్సవం నిర్వహించారు. రథోత్సవం కార్యక్రమానికి వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## గల్లా అరుణ అధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం



తవణంపల్లె, మార్చి 7 ప్రభాతవార్త: మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆధ్వర్యంలో మండలంలోని దిగువమాఘంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ రంగాలలో మహిళా అభ్యున్నతికి విశేష సేవలందిస్తున్న మహిళలు, తన స్వగ్రామమైన దిగువమాఘం కొండ్రాజుకాల్వ, అరగొండ పరిసర గ్రామాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున పాల్గొని సంబరాలను చేసుకున్నారు. ఈమేరకు మహిళలు వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళాభ్యు న్నతికి విశేష సేవలందించిన మాజీ మంత్రి గల్లా అరుణకుమారిని ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ రాజ్యసభ్యురాలు ఎన్‌పీ దుర్గా రామకృష్ణ, అమర హాస్పిటల్స్ అధినేత్రి గౌరినేని రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ఆకాష్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



రొంపిచెర్ల, మార్చి 7 ప్రభాతవార్త : పీలేరులో నిర్వహించిన కరాటే పోటీల్లో రొంపిచెర్లకు చెందిన ఆకాష్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఆకాష్ స్కూల్ విద్యార్థులు 12 మందికి గాను ఆరు మందికి స్వర్ణ, ఐదు మందికి రజిత, ఒక కాంస్య పతకాన్ని సాధించారని విద్యా సంస్థ ఛైర్మన్ పసుపులేటి చంద్రశేఖర్ సంగీత తెలిపారు. విద్యా దశలోనే స్వీయ రక్షణపై అవగాహన కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ద్వారక, ప్రిన్సిపాల్ వందనారెడ్డి, రోజా, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యతోనే మహిళా సాధికారత : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, మార్చి 7 ప్రభాతవార్త : విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ మహిళలు తమ బాధలు, సమస్యలను చర్చించుకోవడానికి, నలుగురితో పంచుకోవడానికి ఒక రోజు ఉండాలనే ఉద్దేశ్యంతో మహిళా దినోత్సవం ప్రకటించారని, తొలిసారి అమెరికాలోని చికాగోలో మహిళా దినోత్సవానికి 1908లోనే బీజాలు పడ్డాయన్నారు. పలు దేశాల్లో మహిళలు మహిళా దినోత్సవాలను నిర్వహించుకున్నారన్నారు. అయితే చివరిగా మార్చి 8వ తేదీని మహిళా దినోత్సవాలను నిర్వహించుకున్నారు. అయితే చివరిగా మార్చి 8వ తేదిన మహిళా దినోత్సవంగా నిర్ణయించడం జరిగిందన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు నడిస్తే సాధించలేనిది ఏది లేదన్నారు. పూర్వం ఒక మహిళ చదుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తుండడం సంతోషకరమన్నారు.

## పదవికి వన్నె తెస్తా జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా

**- ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం**



రేణిగుంట, మార్చి 7 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్సీని చేసిన ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదవికి వన్నె తెస్తానని కొత్తగా ఏకగ్రీవమైన స్థానిక సంస్థల ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీసీలకు న్యాయం చేయడంలో జగన్మోహన్‌రెడ్డి అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ ఇచ్చి ఏకగ్రీవం చేయడంలోకృషి చేసిన జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. జగన్మోహన్‌రెడ్డి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. ఎన్నో సంవత్సరాలు టీడీపీలో పని చేసినప్పటికి తగిన ప్రాధాన్యత లభించలేదని తెలిపారు. రేణిగుంట వచ్చిన డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంకు వైసీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పార్టీ సీనియర్ నేత జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌స్వామి, సర్పంచ్ నాగేషం, గంగారి రమేష్, కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, మైనారిటీ నేతలు అమానుల్లా, షబ్బీర్ అహ్మద్, సైకిల్‌షాపు అలీ, వైసీపీ నేతలు ఇన్బానాథం, కృష్ణమూర్తి, జి.వెంకటరమణ, అసం, అడ్వకేట్ తిరుమలరెడ్డి, రష్ మేనేజర్ లక్ష్మీకాంత్, ఏర్పేడు మండల వైసీపీ నేతలు మాజీ ఎంపీటీసీ మస్తాన్, గోపిరాయల్, దామోధర్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

## అదనపు ఎస్పీ విమలకుమారికి సన్మానం



తిరుపతి,మార్చి 7ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని తిరుపతిలో పోలీసుశాఖలో తనదైన రీతిలో కర్తవ్యదక్షత పాటిస్తున్న క్రైమ్ విభాగం అదనపు ఎస్పీ విమలకుమారిని సన్మానించారు. నగరంలో ఓ కార్యక్రమంలో టిటిడి జెఇఓ సదాభార్గవి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ,సేవా సంస్థ ప్రతినిధులు విమలకుమారి సేవలను,మహిళ రక్షణ,భద్రతకు తీసుకుంటున్న చర్యలను కొనియాడారు.

## శాస్త్రోక్తంగా చండీహోమం



తిరుపతి,మార్చి 7ప్రభాతవార్త: మాఘపౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా మహాచండీహోమం నిర్వహించారు. ఉదయం ఆలయప్రాంగణంలో ఆలయ ఛైర్మన్ కట్టాగోపీ యాదవ్, ఆలయ ఇఒ ఎం.మునికృష్ణయ్య, అర్చకులు వేదోక్తంగా హోమం ప్రారంభించారు. మహాపూర్ణాహుతి, మహాచండీహోమం నిర్వహించి,ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ హోమంలో నగరపాలక మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, ఉపమేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## నిబంధనలకు అనుగుణంగానే మండల సర్వసభ్య సమావేశం : ఎంపిపి

తిరుపతిరూరల్, మార్చి 7 ప్రభాతవార్త: ఎన్నికల నిబంధనల మేరకే తిరుపతిరూరల్ మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశనిర్వహించినట్లు తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ నిబంధనలకు అనుగుణంగానే ఎంపిపి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. మంగళవారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరములో మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అత్యవసర సేవలైన త్రాగునీరు, పారిశుధ్యం, వైద్యసేవలకు సంబంధించిన అంశాలపైన చర్చించారు. తిరుచానూరు పరిధిలో దోమల వృద్ధికి మురికి కాల్వలు కారణమౌతున్నాయని, ప్రజల అనారోగ్యాలబారిన పడుతున్నారని ఎంపిటిసి శివశంకర్ ఫిర్యాదు చేసారు. కాల్వలు శుభ్రపరచాలన్నారు. అలాగే దామినేడు పరిధిలో నిత్యం చెత్త సేకరణ జరగడం లేదని, చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని ఎంపిటిసి హాసీనా కోరారు. డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఓటేరు పంచాయతీ పరిధిలోని పాఠశాలలో అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారుతుందన్నారు. విద్యార్థులు ఆకతాయిలుగా మారి, వారి భవిష్యత్‌ను నాశనంగా చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో ఉప మండలాధ్యక్షులు విడుదల మాధవరెడ్డి, యశోధ, జడ్పిటిసి రత్నమ్మ మండల స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంపిడిఓ వెంకటనారాయణ, ఇవో పిఆర్డీ నీలకంఠేశ్వరరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో గ్లోబల్ విజయవంతం సంబరాలు

శ్రీకాళహస్తి,మార్చి 7 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విశాఖ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయినందుకు మంగళవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి సంబరాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సచివాలయ వ్యవస్థ, వాలంటీర్లు,మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, పార్టీ నాయకులు హాజరు కాగా ముఖ్యఅతిదిగా శాసనసభ్యుడు హాజరై పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్ళాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రతిపథకం విజయవంతమే అన్నారు. ఆయన ఏదీ చేసినా నిరుపేదల క్షేమం, రాష్ట్రం అభివృద్ధికే ముడిపడి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖలో ఏర్పాటు చేసిన గ్లోబల్‌సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు కడలి తరంగాల్లా కదలి వచ్చి సుమారు13లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి క్యూ కట్టారని మధుసూదనరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా కేకను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

**మనం ఏం చేసామో జనానికి చెప్పాలి:**

ప్రభుత్వం చేపడుతున్న విన్నూత్న పథకాలకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. అయితే మనం చేస్తున్న మంచిపనిని అందరికి తెలిసేలా తెలియజేయాలని ఆయన



తెలిపారు. నవతర్నాల పథకాన్ని సూపర్ సక్సస్ చేసారు. అలాగే ఏ నాయకుడు నిరుపేదలను ఆదుకోని విధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 25వేల ఇళ్ళను అందించుటకు సాక్షాత్తు ముఖ్యమంత్రియే వచ్చారని ఎంఎల్ఏ వివరించారు. ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి సుబ్బారెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి, వడ్లతాంగళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి,ఎంపిటిసి గోవిందరెడ్డి, ఊట రమేష్, మునిరత్నం, గోపి గౌడ్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

**CHENGE OF NAME**

I, **KAYAM SUBRAMA REDDY,** S/o K.Venkatasubba Reddy, Residing at D.NO.1-103/1, Uranduru Village, Srikalahasthi Mandal, Tirupati District. PIN-517640. Andhra Pradesh. Changed my Name as **" KAYAM SUBBARAMI REDDY".**

**CHENGE OF NAME**

I.(OLD NAME ) **YETURI RAMAKRISHNA** S/O YETURI SREERAMULUCHANGE MY NAME IS (NEW NAME) **YETURI RAMA KRISHNAIAH** S/O YETURI SREE RAMULU RESI59/56 KAMSALA STREET, RAYACHOTY,ANNAMAYA, DT AP.